సాక్షి రంగారెడ్డి

బుధవారం । 6 । ఆగస్టు । 2025



కుర్మిద్దలో 'మార్‌బని'

యాచారం మండల పరిధిలోని కుర్మిద్దలో జపాన్‌కు చెందిన మార్‌బని కంపెనీ ఏర్పాటు కానున్నట్టు తెలుస్తోంది. 10లో▸



అడ్డు కంచె తొలగింపు

ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో నెలకొన్న దళితవాడకు అడ్డంగా కంచె వివాదం సద్దుమణిగింది. 10లో▸



రైతుల సంక్షేమమే ధ్యేయం

రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ తదితరులు

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ అన్నారు. చేవెళ్లలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణంపై విద్యార్థి దశనుంచే అవగాహన కల్పించాలని అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మోహిదీన్, ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్‌లో తప్పుల గుర్తింపు

సామాజిక తనిఖీలో వెల్లడి



డీఆర్‌డీఓ సమక్షంలో కొనసాగుతున్న సామాజిక తనిఖీ

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గ్రామీణ ఉపాధిహామీ పథకం 2024–25 సంవత్సరానికి సంబంధించి 12వ విడత సామాజిక తనిఖీని డీఆర్‌డీఓ శ్రీలత ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు నిర్వహించారు. మొత్తం మండలంలో ఈజీఎస్ కింద కూలీలు, మెటీరియల్ ఖర్చులకు రూ.6.28 కోట్లు, పీఆర్ పనులకు గాను రూ.1.34 కోట్లు, ఫారెస్ట్ కింద రూ.35.18 లక్షలు ఖర్చు చేసినట్లు గుర్తించారు. అనంతరం పంచాయతీల వారీగా నిర్వహించిన ఆడిట్‌లో గుర్తించిన తప్పులకు సంబంధించి సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు. కొన్ని గ్రామాల్లో మస్టర్లలో కొట్టివేతలు, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం తదితర కారణాలతో సంబంధిత సిబ్బందికి జరిమానా కింద రూ.16వేలు విధించారు. మళ్లీ పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని డీఆర్‌డీఓ శ్రీలత ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ సుభాషిణి, ఎంపీడీఓ సరిత, అంబుడ్స్‌మన్ సునీత, ఏపీడీ చరణ్, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఎస్‌ఆర్‌పీ కాశయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి డిప్లమా, ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఉన్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోర్సులకు ఈనెల 7 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు వాటి జిరాక్స్ కాపీలను నిర్ధారిత ఫీజుతో ఈనెల 8న ఉదయం 9.30 గంటలకు వ్యక్తిగతంగా హాజరు కావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మహేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలో..

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ కోర్సుల్లో 45 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 8న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 94901 20175, 72076 83644 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాహనాల వేలం: రూ.3.11 లక్షల ఆదాయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మూడు వాహనాల వేలం పాటలో రూ.3,11,800 ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఒక బజాజ్ ఆటో, రెండు టీవీఎస్ ఎక్సెల్ వాహనాలకు వేలం వేశారు. 38మంది రూ.5వేల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్@ అజీజ్‌నగర్!

సమీకృత మార్కెట్‌ను తరలించే యోచన

నగరంలోని గుడిమల్కాపూర్ మార్కెట్‌ను ప్రభుత్వం నగర శివారు ప్రాంతానికి తరలించే ప్రక్రియ మొదలు పెట్టింది. కూరగాయలు, పూలు, పండ్ల మార్కెట్‌ను ఒకేచోట ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సమీకృత మార్కెట్‌కోసం ఓఆర్‌ఆర్ పక్కనే అజీజ్‌నగర్ రెవెన్యూలో 150 ఎకరాల స్థలాన్ని సైతం పరిశీలించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదానికి పంపించారు.

- ఓఆర్‌ఆర్ పక్కనే అజీజ్‌నగర్ రెవెన్యూలో భూ పరిశీలన
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించిన అధికారులు
- మార్కెట్ ఏర్పాటైతే రైతులకు సౌలభ్యం



అజీజ్‌నగర్‌లో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు పరిశీలించిన స్థలం

మొయినాబాద్: మెహిదీపట్నం సమీపంలో ఉన్న గుడిమల్కాపూర్‌లో 1992లో అప్పటి అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పూల మార్కెట్ నిర్మించారు. ఆరు ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల మార్కెట్, 11 ఎకరాల విస్తీర్ణంలో పూలమార్కెట్ కొనసాగుతున్నాయి. నిత్యం వేల మంది రైతులు కూరగాయలు, పూలు తీసుకుని మార్కెట్‌కు వెళ్తున్నారు. ప్రతిరోజు 20–25 టన్నుల కూరగాయలు, 30–40 టన్నుల పూలు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

ట్రాఫిక్ తిప్పలు తప్పేలా..

రైతులతోపాటు, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే కూరగాయలు, పూలను లారీలు, డీసీఎంలలో తీసుకొస్తుంటారు. కొనడానికి వచ్చేవారు సైతం వాహనాలను తెస్తుంటారు. మార్కెట్ స్థాయికి మించి వాహనాలు వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. పండుగల సమయంలో సమస్య మరింత జఠిలంగా మారి గంటల తరబడి వాహనాలు నిలిచిపోతుంటాయి. దూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే రైతులు ట్రాఫిక్ సమస్యతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు మార్కెట్‌లో దళారులు ఎక్కువై రైతులు నష్టపోతున్నారు. మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు సైతం కరువయ్యాయి. ఈ పరిస్థితులను అధిగమించడానికి మార్కెట్‌ను నగర శివారుకు తరలించే ప్రక్రియను మొదలు పెట్టారు.

ఓఆర్‌ఆర్ పక్కనే స్థల పరిశీలన

ఔటర్ రింగ్‌రోడ్డు పక్కనే అజీజ్‌నగర్ రెవెన్యూలోని సర్వేనంబర్ 176లో 150 ఎకరాలను మార్కెట్ ఏర్పాటుకు పరిశీలించారు. ఓఆర్‌ఆర్ సమీపంలో మార్కెట్ ఏర్పాటు చేస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి, స్థానిక రైతులకు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతులకు సైతం అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు 150 ఎకరాల భూమిని సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక పంపారు. మార్కెట్ తరలింపునకు సంబంధించిన ప్రతిపాదనలను గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీతోపాటు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రభుత్వానికి పంపారు. భూ కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే స్థల సేకరణ చేపట్టి పనులు మొదలు పెట్టనున్నారు.

ఇబ్బందులు తీరతాయి



గుడిమల్కాపూర్ మార్కెట్‌లో ప్రస్తుతం చాలా ఇబ్బందులు ఉన్నాయి. మార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌కు స్థలం లేదు. ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. మార్కెట్‌ను అజీజ్ నగర్‌కు తరలిస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– గడ్డం వెంకట్‌రెడ్డి, సురంగల్, మొయినాబాద్

రైతుల సౌలభ్యం కోసం



గుడిమల్కాపూర్‌లో స్థలం సరిపోక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌ను ఓఆర్‌ఆర్ సమీపంలోకి తరలించాలని ప్రతిపాదించాం. రైతుల సౌలభ్యంకోసం, మెరుగైన వసతులు కల్పించేందుకు మార్కెట్ కమిటీలో చర్చించి 150 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటుకోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. – కావలి చంద్రశేఖర్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పేదల అభ్యున్నతే లక్ష్యం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

బడంగ్‌పేట్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బాలాపూర్ మండలం మల్లాపూర్‌లోని వైఏఆర్ గార్డెన్‌లో మంగళవారం చేపట్టిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 12 వేల కొత్త రేషన్‌కార్డుల జారీతో సగటున 50 వేల మందికి సన్నరకం బియ్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతానికి కొత్త పరిశ్రమలు తీసుకువస్తున్నామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 65 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు రేషన్‌కార్డులు అందించడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య, కందుకూరు ఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మేయర్ చిగురింత పారిజాత తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా నినాదాలు



నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. మధ్యాహ్నం 1.30 గంటలకు ఎమ్మెల్యే సబితారెడ్డి తన అనుచరులతో కలిసి వచ్చారు. 2 గంటల సమయంలో మంత్రి అక్కడికి చేరుకోగానే బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కసారిగా సబితమ్మ జిందాబాద్, జై బీఆర్‌ఎస్ అంటూ నినాదాలు మొదలుపెట్టారు. అంతే రెట్టింపుతో కాంగ్రెస్ నాయకులు సైతం నినాదాలు చేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డి మైక్ తీసుకుని ప్రొటోకాల్ పాటించకుండా ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. మీరుమీరే పంపిణీ చేసుకుంటే మేమెందుకు ఇక్కడ అంటూ బహిష్కరించి వెళ్లబోయారు. మీరు వెళ్లొద్దంటూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆమెను కోరారు. అదేసమయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. రెండు గంటల పాటు హైడ్రామా చోటు చేసుకుంది. ఏసీపీ జానకిరాం ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం సబితారెడ్డి అనుచరులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించారు. రేషన్‌కార్డులు అందుకోవాలని చంటి బిడ్డలతో వచ్చిన తల్లులు ఏంజరుగుతుందో అర్థంకాక విస్తుపోయి చూశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

మహాసభలను జయప్రదం చేయాలి

తుర్కయంజాల్: సెప్టెంబర్ 19, 20 తేదీల్లో తుర్కయంజాల్‌లో నిర్వహించనున్న మున్సిపల్ కార్మికుల రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ కోరారు. రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని, పని భద్రత లేదని, ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్నా పర్మినెంట్‌కు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వం 2వ పీఆర్‌సీలో కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు, 60 ఏళ్లు పైబడిన, మరణించిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు పనికల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా కల్పించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె సెగ తప్పదని హెచ్చరించారు. అనంతరం ఆహ్వాన సంఘం చైర్మన్‌గా జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.కిషన్, కోశాధికారిగా సీహెచ్ ఎల్లయ్య, పాలడుగు భాస్కర్, ఎం.చంద్రమోహన్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నారు. సమావేశంలో 14 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్ల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- సినిమా స్టంట్స్ తరహాలో ఘటన
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని మృగవని పార్కు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. నార్సింగి మున్సిపాలిటీకి చెందిన సిద్ధార్థ (27) మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తన కారులో నార్సింగి నుంచి మొయినాబాద్ వైపు వెళ్తున్నాడు. మృగవని జాతీయ పార్కు వద్ద వెనకనుంచి అతివేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన సిద్ధార్థ కారు డివైడర్ పైనుంచి అవతలి వైపునకు దూసుకెళ్లింది. ఈ సమయంలో మొయినాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జయింది. డ్రైవింగ్ సీట్లో ఉన్న సిద్ధార్థ అక్కడికక్కడే చనిపోయాడు. కారు బెలూన్లు తెరుచుకున్నప్పటికీ అతని ప్రాణాలు దక్కలేదు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, లారీ కింది భాగంలోకి దూసుకెళ్లిన కారును బయటకు తీశారు. కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసం కావడంతో సిద్ధార్థ అప్పటికే మృతిచెందాడు. సినిమా స్టంట్స్ తరహాలో జరిగిన ప్రమాదం కారణంగా అజీజ్‌నగర్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇదిలా ఉండగా సిద్ధార్థ కారును ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లిపోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హెచ్‌ఆర్‌ఏ పెంచి ఇవ్వండి

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందిస్తున్న హెచ్‌ఆర్‌ఏ పెంచి ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 8 కిలోమీటర్ల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఏ 11శాతం చెల్లిస్తోందని తెలిపారు. 13 శాతం చెల్లించాలని పీఆర్‌సీ 2020 కమిషన్ తన నివేదికలోని పే రివిజన్‌లో పొందుపర్చడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్ప, జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలు, మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ తదితరులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి ఉష

కడ్తాల్: ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి టి.ఉష అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీని ఆమె పరిశీలించారు. మండల పరిధిలో ఎంత వరకు ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తయిందో అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా చూడాలని, తగినంత నిల్వలు ఉండేలా ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం మైసిగండి గ్రామంలో పర్యటించారు. క్వాలిటీ సీడ్ ఫర్ ఎవ్రీ విలేజ్ (క్యూఎస్ఈవీ) పథకంలో లబ్ధిదారుడైన గ్రామానికి చెందిన రామవత్ లక్ష్మణ్‌నాయక్ సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు, రావిచేడ్ గ్రామాల్లో విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శోభారాణి, ఏఓ కవిత, ఏఈఓ కశ్యప్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

షాబాద్: పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సభ్యుడు డాక్టర్ సుశీల్ హరిపాండ్ దేశ్‌ముఖ్, డాక్టర్ కవాస్ ఆనంద్ కృష్ణరాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ ఉప వైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబుతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవల నాణ్యతను మెరుగుపర్చాలని, రోగుల్లో నమ్మకం, ప్రజారోగ్య వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత్, డిస్ట్రిక్ట్ క్వాలిటీ మేనేజర్ రాము, సీహెచ్ఓ సురేందర్‌నాయక్, వైద్య సిబ్బంది కవిత, నీలవేణి, నవీన్, కుమార్, నవీన్, గోపాల్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు



ర్యాలీలో పాల్గొన్న డీవైఎఫ్ఐ నాయకులు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు, యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను నిషేధించాలని ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, గంజాయికు బానిసై జ్ఞానాన్ని, విచక్షణను, శక్తిసామర్థ్యాలను కోల్పోయి జీవితాలను నిస్తేజంగా మార్చుకుంటున్నారని పేర్కొన్నారు. చదువులు, ఉద్యోగాలకు దూరమై కుటుంబాలకు భారమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువతను పెడదారి పట్టిస్తున్న డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వం ఈ మహమ్మారిని ప్రారద్రోలేందుకు కలిసికట్టుగా పోరు సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.జగన్, జిల్లా ఉపాధ్యక్షుడు అలంపల్లి జంగయ్య, నాయకులు పి.శివశంకర్, ఆర్.స్వామి, రాఘవేందర్, శివ, చైతన్య, మహేశ్, ప్రభాకర్, లెనిన్, వినోద్, యాదగిరి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కోసం వెతికితే బుల్లెట్ దొరికింది

- సెల్‌ఫోన్ దొంగ వద్ద స్వాధీనం
- విచారణ చేపడుతున్న పోలీసులు

మీర్‌పేట: సెల్‌ఫోన్ దొంగను తనిఖీ చేయగా బుల్లెట్ (తూటా) లభించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ కథనం ప్రకారం.. మీర్‌పేట ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీకి చెందిన అంగోత్ భరత్‌నాయక్ సెల్‌ఫోన్‌ను మూడు రోజుల క్రితం లెనిన్‌నగర్‌లో నివసించే పెయింటర్ సోమన చంద్రశేఖర్ అలియాస్ సన్నీ దొంగిలించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా కనిపించిన చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని అతని ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా సెల్‌ఫోన్‌తో పాటు బ్యాగులో బుల్లెట్ (8ఎంఎం) లభ్యమైంది. పెయింటింగ్ పని నిమిత్తం గచ్చిబౌలి వెళ్లినప్పుడు రోడ్డు పక్కన దొరికిందని చంద్రశేఖర్ విచారణలో వెల్లడించాడు. అతని ఇంట్లో గంజాయి సేవించే డబ్బాలు, మద్యం బాటిల్స్ లభ్యమయ్యాయి. గతంలో మీర్‌పేట పరిధిలో దొంగతనం, శేరిలింగంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. బుల్లెట్‌ను సీజ్ చేసి విచారణ చేపడుతున్నారు.

ఆహార విక్రయంలో ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న నెస్‌లే ఇండియా కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ వసీం

షాద్‌నగర్‌రూరల్: వీధి ఆహార విక్రేతలు పరిశుభ్రతను పాటించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని నెస్లే ఇండియా కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ ఎం.డి.వసీం అన్నారు. పట్టణంలోని పద్మశాలి సంఘం భవనంలో మంగళవారం నేషనల్ అసోసియేషన్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా, నెస్లే ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వీధి ఆహార విక్రేతలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసీం మాట్లాడుతూ.. వీధి ఆహార విక్రేతలు ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఆహార నిల్వ, ప్లాస్టిక్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 26 ఏళ్లుగా వీధి ఆహార విక్రేతల హక్కులకోసం పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 1,700 మంది వీధి ఆహార విక్రేతలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. నేషనల్ అసోసియేషన్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రంగాశాలివాహన్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే వినియోగదారుల్లో వీధి ఆహారంపై విశ్వాసం పెరుగుతుందని అన్నారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ ప్రమాణాల ప్రకారం శిక్షణ తీసుకున్న వీధి ఆహార విక్రేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఖలీల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దళితవాడకు అడ్డు కంచె తొలగింపు

సద్దుమణిగిన వివాదం


గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతున్న బూర్గుల సుమన

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో నెలకొన్న దళితవాడకు అడ్డంగా కంచె వివాదం సద్దుమణిగింది. రాకపోకలకు ఇబ్బందులు రాకుండా దారిని ఏర్పాటు చేశారు. కంచె ఏర్పాటుపై మంగళవారం దళిత సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ, టీఎమ్మార్పీఎస్, ధర్మసమాజ్ పార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ, కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అడ్డుగా వేసిన కంచెను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ అవసరాల కోసం ఇచ్చిన స్థలంలో కంచె వేయడం ఏమిటని ప్రశ్నించారు. దళితులకు దారి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాలనే ఆలోచనతోనే కంచె ఏర్పాటు చేశారని ఆరోపించారు. కంచె ఏర్పాటుతో దళితులు తమ ఇళ్లకు రాకపోకలు కొనసాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. కంచె ఏర్పాటుతో ఇబ్బంది కలుగుతుందంటే తొలగిస్తామని బూర్గుల నర్సింగ్‌రావు సోదరి సుమన చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, వివిధ సంఘాల నాయకులు సామేల్, జంగయ్య, చెన్నయ్య, శ్రీశైలం, శ్రీనునాయక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం ఏర్పాటు చేస్తాం

స్వాతంత్ర్య సమరయోధుడు బూర్గుల నర్సింగ్‌రావు గ్రామ అవసరాలకు ఇచ్చిన స్థలంలో ఆయన స్మృతివనం ఏర్పాటు చేస్తామని ఆయన సోదరి, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బూర్గుల సుమన వెల్లడించారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించిన ఆమె గ్రామస్తులు, దళితులతో మాట్లాడారు. దళితులు వెళ్లడానికి దారి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామానికి ఇచ్చిన స్థలంలో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారని, ఆ స్థలంలో బోర్లు వేసి గ్రామానికి నీటి సరఫరా చేస్తున్నారని అన్నారు. ఆ స్థలంలో బూర్గుల నర్సింగ్‌రావు ఉద్యానవనం ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారని, ఆ కోరిక తీరకుండానే ఆయన మృతి చెందారని చెప్పారు. ఏ రోజూ తాము ఆ స్థలాన్ని తిరిగి తీసుకోవాలనే ఆలోచన చేయలేదన్నారు. స్మృతివనం ఏర్పాటు చేస్తే మొక్కలను పశువులు మేస్తాయనే ఆలోచతో కంచె వేశామే తప్ప ఆక్రమించుకునేందుకు కాదని స్పష్టం చేశారు.

జ్యోతిర్లింగ యాత్రకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు

సాక్షి, సిటీబ్యూరో: జ్యోతిర్లింగ యాత్ర కోసం దక్షిణమధ్య రైల్వే ప్రత్యేకంగా భారత్ గౌరవ్ పర్యాటక రైలును నడిపేందుకు చర్యలు చేపట్టింది. ఈ రైలు ఈ నెల 16న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరనుంది. ఈ యాత్ర 8 రాత్రులు, 9 పగళ్లు చొప్పున కొనసాగనుంది. పర్యటనలో యాత్రికులు పంచజ్యోతిర్లింగాలైన మహా కాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, గృష్ణేశ్వర్‌లను సందర్శిస్తారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్కేడ్, నాందేడ్, పూర్ణా తదితర స్టేషన్‌ల నుంచి ఉజ్జయినికి ప్రయాణం కొనసాగుతుంది. ఈ పర్యటనలో ప్రయాణంతో పాటు భోజనం, వసతి తదితర అన్ని సదుపాయాలు ఉంటాయి. స్లీపర్ బోగీ అయితే రూ.14,700, థర్డ్ ఏసీ రూ.22,000, సెకండ్ ఏసీ రూ.29,900 చొప్పున చార్జీలు ఉంటాయి. పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్: www. irctctourism. com ను సందర్శించవచ్చు. లేదా 97013 60701, 92810 30740లను సంప్రదించవచ్చు.

కుర్మిద్దలో 'మార్‌బని'

- జపాన్‌కు చెందిన కంపెనీ ఏర్పాటుకు వెయ్యి ఎకరాలు కేటాయింపు
- ఎకరాకు రూ.45 లక్షల చొప్పున పట్టా రైతులకు పరిహారం
- మీరాఖాన్‌పేట టీజీఐఐసీ వెంచర్‌లో 121 గజాల ప్లాటు
- మొండిగౌరెల్లి అసైన్డ్ భూములు డిఫెన్స్‌కు ఇచ్చే ఆలోచన


మార్‌బని కంపెనీకి ఇవ్వనున్నట్లు తెలుస్తోన్న భూమి

యాచారం: కుర్మిద్దలో జపాన్‌కు చెందిన మార్‌బని అనే కంపెనీకి ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీకి యాచారం మండల పరిధిలోని కుర్మిద్దలో 426.32 ఎకరాలు, కందుకూరు మండలం మీరాఖాన్‌పేటలో 546.10 ఎకరాలు కేటాయిస్తున్నారు. కుర్మిద్ద గ్రామంలోని సర్వేనంబర్ 311, 312తో పాటు 290, 291, 294, 295, 296, 297, మీరాఖాన్‌పేట పరిధిలోని సర్వే నంబర్ 113, 114, 118లో దాదాపు వెయ్యి ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సర్కార్ సదరు కంపెనీకి ఇచ్చి ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

మొదట్లో ససేమిరా.. తర్వాత అంగీకారం

మార్‌బని కంపెనీకి కుర్మిద్దలోని సర్వేనంబర్ 290 నుంచి 297 వరకున్న పట్టా భూములు ఇవ్వడానికి రైతులు ససేమిరా అన్నారు. సర్కార్ నిర్మించడానికి నిర్ణయించిన గ్రీన్ ఫీల్డ్ రోడ్డు పక్కనే ఈ భూములు ఉండడంతో మొదట్లో ఆగ్రహం వ్యక్తమైంది. మెరుగైన పరిహారంతోపాటు 121 గజాల ప్లాటు ఆఫర్‌తో మెత్తబడ్డారు. పట్టా భూములు ఇవ్వడానికి ముందుకు రావడంతో రెవెన్యూ అధికారులు దాదాపు 50 ఎకరాలకు పైగా సేకరించారు. టీజీఐఐసీ ద్వారా రూ.30 లక్షలు, మార్‌బని కంపెనీ నుంచి రూ.15 లక్షల చొప్పున పరిహారం ఇప్పించారు. కంపెనీకి కేటాయించడానికి ఇంకా పట్టా భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు రైతులతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు.

మొండిగౌరెల్లిలో అభిప్రాయసేకరణ

మొండిగౌరెల్లిలోని 820 ఎకరాల అసైన్డ్, పట్టా భూమి సేకరణకు మూడు నెలల క్రితం సర్కార్ నోటిఫికేషన్ ప్రకటించింది. గ్రామంలోని సర్వేనంబర్ 19, 68, 127 అసైన్డ్ నంబర్లతో పాటు పలు పట్టా సర్వేనంబర్లలో ఉన్న భూములను కూడా నోటిఫికేషన్‌లో పొందుపర్చింది. పారిశ్రామిక పార్క్ కోసమంటూ ప్రకటించింది. ఏ కంపెనీలకు ఆ భూములను కేటాయిస్తుందో మాత్రం నేటికీ ప్రకటించలేదు. ఆ తర్వాత ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి గ్రామంలోని అసైన్డ్, పట్టా భూములను పరిశీలించి భూసేకరణపై రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. భూములిచ్చే విషయంలో మిశ్రమ స్పందన రావడంతో ఏ నిర్ణయం తీసుకోలేదు.

డిఫెన్స్‌కు అసైన్డ్ భూములు!

మొండిగౌరెల్లిలో అత్యధికంగా రైతులు పుదీన, ఆకుకూరలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఈ గ్రామాన్ని కూరగాయలు, ఆకుకూరల పెంపు కోసం దత్తత తీసుకుంది. గ్రామ రైతులు కూడా రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. పట్టా భూములతో పాటు, వెంచర్ ద్వారా ప్లాట్లు చేసిన భూమిని మినహాయించాలని కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓకు రైతు కమిషన్ చైర్మన్ సూచించారు. తాజాగా ఆ గ్రామ భూములు డిఫెన్స్‌కు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డిని సంప్రదించగా కుర్మిద్దలోని వెయ్యి ఎకరాలను మార్‌బని కంపెనీకి సర్కార్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం ఉందని తెలిపారు.

డిప్యుటేషన్‌పై ఫ్యూచర్ సిటీకి పలువురు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)లో కొంత మంది అధికారులను డిప్యుటేషన్‌పై నియమిస్తూ పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు. టీజీబీపీఏఎస్ఎస్‌లో ఆన్ డ్యూటీ బేసిస్‌పై పనిచేస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ కె.స్నేహ మాలను బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌గా నియమించారు. నల్లగొండ డీటీసీపీఓగా పని చేస్తున్న లక్ష్మీనారాయణ బదిలీ చేస్తూ డిప్యూటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్/ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హెచ్ఎండీఏ ఏపీఓ జి.సురేష్‌కు ఎఫ్‌సీడీఏలో ఏపీఓగా, జీహెచ్ఎంసీ నార్త్ జోన్ ఈఈ బి.గోపాల్‌ను ఎఫ్‌సీడీఏ ఈఈగా పోస్టింగ్ ఇచ్చారు. నల్లగొండ మున్సిపాలిటీలో పబ్లిక్‌హెల్త్ ఈఈగా పనిచేస్తున్న సత్యనారాయణను బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో ఈఈగా నియమించారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి ఓఅండ్ఎం డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న పి. ఆనంద్‌ను బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో డిప్యూటీగా నియమించారు. జీహెచ్ఎంసీ ఎస్ఎన్‌డీపీలో డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న వెంకట్ కిరణ్ రెడ్డి బదిలీ చేస్తూ డిప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏలో డిప్యూటీ ఈఈగా నియమించారు.

ద్విచక్ర వాహనాల దొంగకు రిమాండ్

నాలుగు బైక్‌లు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన ఏసీపీ లక్ష్మీనారాయణ


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఠాణాలో సీఐ విజయ్‌కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ కేసు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని చెరుకుపల్లికి చెందిన నర్సింలు జూన్ 19న ద్విచక్ర వాహనంపై షాద్‌నగర్‌కు వచ్చాడు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న కొరియర్ కార్యాలయం పక్కన తన బైక్ పార్క్ చేసి వెళ్లాడు. మరునాడు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో ఆయన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా సాంకేతిక నైపుణ్యంతో కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వకు చెందిన కొర్రా వినోద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపారు.

నాలుగు బైక్‌లు స్వాధీనం

నిందితుడిపై ఇప్పటికే షాద్‌నగర్ ఠాణా పరిధిలో నాలుగు, ఆర్‌జీఐ పీఎస్ పరిధిలో ఒకటి, కొత్తూరు పరిధిలో నాలుగు, అఫ్జల్‌గంజ్ పీఎస్ పరిధిలో రెండు కేసులు నమోదై జైలు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు. నిందితుడి నుండి రూ.2 లక్షల విలువ చేసే బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శివారెడ్డి, సిబ్బంది రవీందర్, సంతోశ్, కర్ణాకర్, జాకీర్, రాజు చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలిపారు.

ఇద్దరు చైన్ స్నాచర్లకు..

ఇబ్రహీంపట్నం: ఇద్దరు చైన్ స్నాచర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తలకొండపల్లికి చెందిన సంఫీ నాగరాజు(25) అల్మాస్‌గూడలో నివసిస్తూ ఆమెజాన్ కంపెనీలో ప్యాకింగ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. 2023లో ఓ రేప్ కేసులో జైల్‌కు వెళ్లి వచ్చాడు. షార్ట్ ఫిల్మ్‌లు తీస్తున్న నాగరాజుకు నెల రోజుల క్రితం జడ్చర్లకు చెందిన వేదవ్యాస్ (24)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఒకే రూంలో ఉంటున్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు ఇరువురూ సులువుగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్ బాటపట్టారు. ఈ నెల 1వ తేదీన పోల్కంపల్లి పంచాయతీ పరిధిలోని జాజోనిబావికి చెందిన లావణ్య(33) తమ పొలంలో పశువులను మేపుతుండగా నాగరాజు, వేదవ్యాస్ బైక్‌పై వచ్చి ఆమె మెడలోంచి పుస్తెల తాడును అపహరించేందుకు యత్నించారు. సదరు మహిళ అప్రమత్తమై గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చారు. అప్రమత్తమైన దుండగులు వెంటనే పుస్తెలతాడును వదిలి పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న క్రమంలో మంగళవారం మంగళ్‌పల్లి వద్ద చైన్ స్నాచింగ్ కోసం యత్నిస్తూ పోలీసులకు చిక్కారు. చైన్‌స్నాచింగ్‌కు వాడిన వేదవ్యాస్ ఆర్15 బైక్‌ను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

బాలుడు అదృశ్యం


చందు (ఫైల్)

కొందుర్గు: బాలుడు అదృశ్యమైన ఘటన కొందుర్గు ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన దర్గ చందు(15) స్థానిక బీసీ హాస్టల్‌లో ఉంటూ కొందుర్గు జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో జూలై 31న పాఠశాలకు మూడు రోజులు సెలవులున్నాయని కుటుంబ సభ్యులకు అబద్ధపు సమాచారం ఇచ్చి స్వగ్రామానికి వచ్చాడు. అనుమానం వచ్చిన బాలుడి తండ్రి నర్సింలు ఈ నెల 2న పాఠశాల ఉన్నప్పటికీ ఇంటికి ఎందుకు వచ్చావని మందలించాడు. ఈ నెల 3న హాస్టల్‌కు వెళ్తున్నాని చెప్పి బయలుదేరాడు. తండ్రి మంగళవారం హాస్టల్‌కు వెళ్లగా సిబ్బంది రాలేదని చెప్పా రు. నర్సింలు బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎటువంటి ఆచూకీ లభించక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండాపూర్‌లో అక్రమ బ్లాస్టింగ్

పాఠశాలలో పడ్డ బండరాళ్లు

గచ్చిబౌలి: కొండాపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన బ్లాస్టింగ్‌తో పక్కన్నే ఉన్న చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బండ రాళ్లు పడటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాళ్లు పడ్డ ప్రాంతంలో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లో ఓ రియల్‌ఎస్టేట్ సంస్థ సైట్‌లో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బండ రాళ్లు పగులగొట్టేందుకు బ్లాస్టింగ్ చేపట్టారు. కాంట్రాక్టర్ కంట్రోల్ బ్లాస్టింగ్ చేయకపోవడంతో సైట్‌ను ఆనుకొని ఉన్న చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఎగిరి బండ రాళ్లు పడ్డాయి. ఆ సమయంలో కొంత మంది విద్యార్థులు ఆటలు ఆడుకుంటుండగా మరికొంత మంది లంచ్ బ్రేక్ కావడంతో ఆవరణలో ఉన్నారు. బండరాళ్లు ఉవ్వెత్తున దూసుకురావడంతో విద్యార్థులు ఆందోళనతో తరగతి గదుల్లోకి పరుగులు తీశారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా బ్లాస్టింగ్ చేయడంతో బండరాళ్లు స్కూల్‌లో పడ్డాయని వైస్ ప్రిన్సిపాల్ రంజిత్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బ్లాస్టింగ్ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇబ్బందులు 'దారి'కొచ్చేలా..

ఏఓసీ ప్రత్యామ్నాయ రోడ్ల కోసం రూ. 960 కోట్లు

- మూడు ఫ్లై ఓవర్లు, ఆర్ఓబీ, ఇతరత్రా రోడ్లు
- కంటోన్మెంట్ పరిధిలో వాహనదారులకు తప్పనున్న ఇక్కట్లు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి రాకపోకలు సాగించే వాహనదారులకు పలు సందర్భాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు త్వరలో తొలగిపోనున్నాయి. ఆయా సందర్భాల్లో కొన్ని మిలిటరీ రోడ్లను మూసివేస్తుండటంతో పడరాని పాట్లు పడుతున్నారు. తీవ్ర ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. ఎంతో కాలంగా ప్రజలు పడుతున్న ఈ బాధలకు చెక్ పెట్టేలా ఏఓసీ (ఆర్మీ ఆర్డినెన్స్ కారప్స్) సెంటర్ దగ్గర ప్రత్యామ్నాయ మార్గాల నిర్మాణానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. మూడు ఫ్లై ఓవర్లు, ఒక ఆర్ఓబీ, కొన్ని గ్రేడ్ రోడ్ల నిర్మాణాల కోసం ఇప్పటికే టెండర్లు పిలిచింది. వీటి నిర్మాణాల అంచనా వ్యయం రూ.307 కోట్లు కాగా, స్థలాల సేకరణ తదితరాలు కలిపి మొత్తం ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.960 కోట్లుగా అధికారులు తెలిపారు. ఫ్లై ఓవర్లను వెల్లింగ్టన్ రోడ్ –ఎలివేటెడ్ రోటరీ, ఈస్ట్ మారేడ్‌పల్లి–ఎలివేటెడ్ రోటరీ, ఎలివేటెడ్ రోటరీ –సఫిల్‌గూడ వరకు నిర్మించనున్నారు. వీటితో పాటు ఎస్ఎం సైడింగ్స్‌పై ఆర్వోబీని, వెల్లింగ్టన్ రోడ్, ఈస్ట్ మారేడ్‌పల్లి రోడ్, మహేంద్రహిల్స్ – ఆర్‌కేపురం ఆరోఓబీ వద్ద ఎట్‌గ్రేడ్ రోడ్లు నిర్మించనున్నారు.

నిర్మాణాలు ఇలా..

వీటిల్లో వెల్లింగ్టన్ రోడ్–ఎలివేటెడ్ రోటరీ వరకు ఫ్లై ఓవర్ నాలుగులేన్లతో, ఫుట్‌పాత్‌లతో, 12 మీటర్ల క్యారేజ్‌వేలతో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈస్ట్ మారేడ్‌పల్లి–ఎలివేటెడ్ రోటరీ కూడా నాలుగులేన్లు, ఫుట్‌పాత్‌లతో 15 మీటర్ల క్యారేజ్‌వేలతో ఉంటుందని, ఆర్ఓబీ 22 మీటర్ల క్యారేజ్‌వేతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఫ్లై ఓవర్ల మీద వాహన వేగం 30 కేఎంపీహెచ్‌గా, గ్రేడ్‌రోడ్ల వద్ద 40కేఎంపీహెచ్‌గా కనిష్ఠంగా ఉండేలా డిజైన్లు ఉంటాయని తెలిపారు. ఈ నిర్మాణాలు పూర్తయితే మల్కాజిగిరి, సఫిల్‌గూడ, సైనిక్‌పురి, ఆర్‌కేపురం తదితర ప్రాంతాల వారికి సాఫీ ప్రయాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడి దుర్మరణం

నిజాంపేట్: నగర శివారులోని ప్రగతినగర్ ఎలీప్ సర్కిల్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న ఒక వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైకు నడుపుతున్న బీటెక్ విద్యార్థి నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం మధ్యాహ్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్యాంకర్ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

డీసీసీబీ చైర్మన్ సత్తయ్య



ఇటీవల సంఘం సాధించిన అవార్డులతో పాలకవర్గ సభ్యులు

తుర్కయంజాల్: రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసమే సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం డీసీసీబీ చైర్మన్ అధ్యక్షతన తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 23 మంది సభ్యులను సంఘంలో నూతనంగా చేర్చుకున్నామని, 24 మంది రైతులకు రూ. 2.65 కోట్లు రుణాలను మంజూరు చేశామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఆడిట్ సర్టిఫికెట్‌ను ఆమోదించడంతో పాటు, 2025–26 మే 1వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు మూడు నెలల జమా ఖర్చులను ఆమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, లక్ష్మమ్మ, సంజీవ రెడ్డి, యాదగిరి, ఎస్.లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సీఈఓ వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

రూ.13 కోట్లు ఫట్!

వెలుతురు వెనుక అవినీతి చీకటి?

- ఎల్ఈడీ వీధిదీపాల పేరిట లూటీ
- ఏడేళ్లు సాగిన అక్రమాల తంతు
- కళ్లు మూసుకున్న బల్దియా



సాక్షి, సిటీబ్యూరో: ఒకటి కాదు.. వంద కాదు.. ఏకంగా 72,549 వీధిదీపాలు లేకుండానే వాటి ఏర్పాటు, నిర్వహణ పేరిట కాంట్రాక్టు ఏజెన్సీకి నిధులు చెల్లించారు. ఈ అవినీతి తంతు ఏకంగా ఏడేళ్లు సాగింది. ఇవి ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణకు గాను జీహెచ్ఎంసీ ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్)కు గత ఏప్రిల్ నెలాఖరు వరకు ముగిసిన ఏడేళ్ల కాంట్రాక్టు కాలంలో చెల్లించిన నిధులు. ఒక్కో వీధిదీపం నిర్వహణకు నెలకు రూ.22 వంతున ఏడేళ్ల కాలానికి దాదాపు రూ.13,40,70,552 చెల్లించారు. ఇవి కేవలం నిర్వహణ పేరిట. ఇక వీధిదీపాల ఏర్పాటు ఖర్చు మరింత అ'ధనం'. ఎంతో కాలంగా నగరంలో కారుచీకట్లు అలుముకున్నా, ఒప్పందం మేరకు 98 శాతం వీధిదీపాలు వెలగకున్నా, ఈఈఎస్ఎల్‌పై జీహెచ్ఎంసీ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోలేదు. మరోవైపు జీహెచ్ఎంసీ తమకు కోట్ల నిధులు చెల్లించాల్సి ఉందంటూ ఈఈఎస్ఎల్ ప్రచారం చేసుకుంది. కాంట్రాక్టు ఒప్పందం మేరకు డ్యాష్‌బోర్డు పని చేయకున్నా, సీసీఎంఎస్ (సెంట్రల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) బాక్స్‌లు పని చేయకున్నా జీహెచ్ఎంసీ పట్టించుకున్న పాపాన పోలేదు.

తప్పుడు లెక్కలు

ఈఈఎస్ఎల్ ఒప్పందం ముగియడానికి ముందు.. తిరిగి వీధిదీపాల నిర్వహణ బాధ్యతలు కొత్తగా ఎవరికివ్వాలన్న అంశం చర్చకు రాగా, అప్పటి కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అసలు నగరంలో వాస్తవంగా ఉన్న వీధిదీపాలెన్నో లెక్క తీయాలని భావించి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించగా, 4,77,539 వీధిదీపాలు మాత్రమే లెక్క తేలాయి. ఒప్పందం ప్రకారం 5,50,088 వీధిదీపాలు ఏడేళ్లపాటు వెలుగులు విరజిమ్మాలి. అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసేంత వరకు కూడా అసలెన్ని వీధిదీపాలున్నాయో, ఎన్ని వెలిగాయో కూడా చూడకుండానే చెల్లింపులు చేశారంటే నిజంగా నిద్రపోయారా, లేక నిద్ర నటించి అవినీతిని ప్రోత్సహించారా? అన్నది జీహెచ్ఎంసీకే తెలియాలి.

పర్యవేక్షణ లేమి..

- జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగాన్ని చాలా కాలంగా నిర్లక్ష్యం చేశారు. ప్రజల నుంచి జీహెచ్ఎంసీకి అందుతున్న ఫిర్యాదుల్లో సింహభాగం వీధిదీపాలవే అయినా సమస్యను పరిష్కరించలేకపోయారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్లలో ఇప్పటికీ 50 శాతం వీధిదీపాలు వెలగడం లేవు. పేరెన్నికగన్న దుర్గంచెరువు బ్రిడ్జిమీద సైతం నెలలో సగం రోజులు చీకట్లే అలుముకుంటున్నాయి. ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమైనట్లు మెసేజ్ తప్ప నిజంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫిర్యాదు చేసేందుకు ప్రజలు కార్యాలయాలకు వెళ్లినా అక్కడ కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు తప్ప సంబంధిత ఇంజినీర్లు కనిపించరు. అదేమంటే క్షేత్రస్థాయి విధులకు వెళ్లారని చెబుతారు. కానీ, వారు క్షేత్రస్థాయిలోనూ కనిపించరు.
- పనులకు సంబంధించిన ఎస్టిమేట్స్ సైతం ఫోన్లు చేసి చెప్పి ఆపరేటర్ల ద్వారానే వేయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రాత్రి 9 గంటల వరకు క్షేత్రస్థాయి విధులు నిర్వహించాల్సిన ఇంజినీర్లు దాదాపు 7 గంటల సమయంలో క్షేత్రస్థాయిలో ఉన్నట్లు సంబంధిత వాట్సాప్ గ్రూపు లో ఒక ఫొటో పెడుతూ ఉన్నతాధికారులను మభ్యపెడుతున్నట్లు సమాచారం. జెన్‌కో నుంచి వచ్చిన డీఈఈ స్థాయి వారికే సదుపాయాలతో కలిపి ఏటా దాదాపు రూ. 50 లక్షల జీతం చెల్లిస్తున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేదు. ఏడేళ్లు దాటినా వీధిదీపాల లెక్కలే సరిగ్గా లేవంటే పనితనం అంచనా వేసుకోవచ్చు.

తాత్కాలికం పేరుతో..

పండుగలు, ప్రత్యేక దినోత్సవాల పేరిట ఆయా సందర్భాల్లో తాత్కాలిక వీధిదీపాల పేరుతో ఏటా దాదాపు రూ.30 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వాస్తవానికి నగరమంతా ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణ అన్నప్పుడు విడిగా మళ్లీ తాత్కాలికం పేరిట నిధుల ఖర్చెందుకో అర్థం కాదు. ప్రత్యేక సందర్భాల్లో రంగుల కాంతుల వంటివి తాత్కాలికంగా ఏర్పాటు చేయవచ్చు కానీ.. వీధిదీపాలు తాత్కాలికం ఏమిటో అంతుపట్టదు. వివిధ పనుల్లోనూ అవినీతి చేతివాటం ఎంతో జరుగుతున్నట్లు తెలుస్తోంది. విద్యుత్ పోల్స్ మార్చడం తదితర పనులకు కాంట్రాక్టర్లు 60 శాతం లెస్‌కు టెండర్లు వేస్తున్నారంటే, వాటి వెనుక అవినీతి ఎంతో అంచనా వేసుకోవచ్చు.

దారి మళ్లుతున్న కేబుల్?

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్ జోన్లలో అవసరం లేకున్నా కేబుల్ తదితర సామగ్రి భారీగా కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాటిని ఎక్కడ వినియోగించారో, ఏం చేశారోలెక్కాపత్రం ఉండదు. వక్రమార్గంలో అవి ప్రైవేట్ కాంట్రాక్టర్ల పరం అవుతాయనే ఆరోపణలున్నాయి. అయినప్పటికీ, ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని సమాచారం.

వస్తే .. కదలరు



ఇతర విభాగాల నుంచి జీహెచ్ఎంసీకి వచ్చే అధికారులు గరిష్ఠంగా ఐదేళ్ల వరకు డిప్యుటేషన్‌లో కొనసాగవచ్చు. విద్యుత్ విభాగంలో పని చేస్తున్న ఇంజినీర్లు మాత్రం ఆ కాలపరిమితి దాటినా కొనసాగుతున్నారు. బాధ్యతల అప్పగింతలోనూ వివక్ష కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి. కొందరు ఈఈలకు ఒక్క సర్కిల్ పర్యవేక్షణ మాత్రమే ఉండగా, కొందరికి ఆరేడు సర్కిళ్లు కూడా ఉండటం వెనుక మతలబు ఏమిటో సంబంధీకులకే తెలియాలి మరి.